# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2023** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.**

2. **శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ఫిష్ ఆంధ్రా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు.**

3. **రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ప్రకృతి వ్యవసాయం విస్తరించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

4. **రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.**

5. **నూతన జాతీయ విద్యావిధానంపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తారు.**

==========================

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభమైంది. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం ముందు వాదనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు నాయుడు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు వ్యవహారంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరతూ చంద్రబాబు నాయుడు పిటిషన్ దాఖలు చేశారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ కింద గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా.. చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

-------------------------

శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ఫిష్ ఆంధ్రా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. జిల్లాలోని పొన్నాడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చేప పిల్లల రవాణాకు 13.39 లక్షల రూపాయలు వెచ్చించి వాహనం కొనుగోలు చేశామన్నారు. మత్స్యకారులను పెద్ద

ఎత్తున ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని... వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని అన్నారు. నాణ్యమైన చేప పిల్లలను మత్స్యకారులకు అందించాలనే లక్ష్యంతో ఫిష్ ఆంధ్రాకు రూపకల్పన చేశామని తెలిపారు. వేటకు వెళ్ళి చనిపోయిన వారికి 10 లక్షల రూపాయలను ప్రభుత్వం పరిహారం కింద అందజేస్తున్నామని.. అర్హులయిన వారికి డీజిల్ సబ్సిడీ అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

-------------------------

ప్రకృతి వ్యవసాయం కరవు ప్రాంత రైతులకు వరంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా మడకశిర మండలం గోవిందాపురంలో రైతులు సాగు చేసిన అంతర పంటలను నిన్న ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే దిశగా ప్రకృతి వ్యవసాయం చేసి లాభాలు పొందాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. జిల్లాలో ప్రతి గ్రామానికి ప్రకృతి వ్యవసాయం విస్తరించేలా చర్యలు చేపట్టాలని జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

-------------------------

తిరుపతిలోని 50 డివిజన్లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమైంది. అర్హులైన నిరుపేదలందరికీ ఉచితంగా 20 రకాల వైద్య పరీక్షలతో పాటు మందులను కూడా పంపిణీ చేస్తున్నారు. బీపీ, షుగర్, కిడ్నీ, లివర్ టెస్టులతో పాటు ఇతర పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి గిరి తెలిపారు. ఈ రోజు సాయంకాలం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. నిరుపేద రోగులు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

-------------------------

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అయితే సంక్షేమ ఫలాలు అందడం లేదంటూ ప్రతిపక్షాలు పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నాయని.. ప్రతిచోట ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

-------------------------

ఈ-సిగరెట్లు లేదా అటువంటి పరికరాలను కలిగి ఉండడం ఎలక్ట్రానిక్ సిగరెట్ నిరోధక చట్టం-2019ని ఉల్లంఘించడమేనని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ స్పష్టంచేసింది. ఈ విషయంలో పరికరాల పరిమాణం, ఇతర అంశాలతో సంబంధం లేదని పేర్కొంది. పౌర విమానయాన శాఖకు గత నెలలో పంపిన వివరణలో ఈ మేరకు స్పష్టత నిచ్చింది. ఈ-సిగరెట్ల వినియోగంపై చట్టంలో స్పష్టమైన నిషేధాన్ని పేర్కొనకపోయినప్పటికీ.. ఈ సిగరెట్ల ఉత్పత్తి, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, నిల్వచేయడం, ప్రకటనలు ఇవ్వడం వంటివాటిని చట్టం నిషేధిస్తోందని ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

-------------------------

నూతన జాతీయ విద్యావిధానంపై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రేపు, ఎల్లుండి జాతీయ సదస్సు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రిజిస్ట్రార్ సీహెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సదస్సు నిర్వహణ వివరాలను కన్వీనర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, సభ్యులు ఎన్.శ్రీనివాసరావులతో కలసి ఆయన నిన్న విశ్వవిద్యాలయంలో పాత్రికేయులకు వెల్లడించారు. 'నూతన జాతీయ విద్యావిధానం.. మెరుగైన రీతిలో అమలుకు అవలంబించాల్సిన విధానాలు, వ్యూహాలు' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నామని

తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఢిల్లీ, సిక్కిం, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, మిజోరాం, తదితర రాష్ట్రాలకు చెందిన వంద మంది విద్యా రంగ నిపుణులు తమ పరిశోధన పత్రాలను ఇప్పటికే విశ్వవిద్యాలయాకి పంపించారని రిజిస్ట్రార్ తెలిపారు.

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం రామినాయుడువలస ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ కారణంగా అక్కడ 144 సెక్షన్ అమలు చేస్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారిణి జీఏపీ ప్రసూన తెలిపారు. రేంజర్ మణికంఠేష్ నేతృత్వంలో ట్రాకర్ల బృందం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. కన్నపుదొరవలస, నిమ్మలపాడు, వెంకట్రాజపురం, ఎరుకులపేట, గౌరీంపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఒంటరి ఏనుగు హరి కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయాల్లో దిగువకు వస్తున్నందున జాగ్రత్తలు పాటించాలని కోరారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంచాయతీలకు కేటాయించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో సర్పంచులు రాష్ట్రవ్యాప్తంగా మహాత్మగాంధీ విగ్రహాల వద్ద నిన్న ఆందోళనలు చేపట్టారు. సర్పంచులు నల్లచొక్కాలు, రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం.. పంచాయతీలకు ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని సర్పంచులు ఆరోపించారు.

---------------------------

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏలూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రజలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంగణంలో నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛత పాటిస్తామంటూ 5వేల మంది ప్రమాణం చేసిన అనంతరం చేపట్టిన మెగా సెల్ఫీ క్యాంపు విజయవంతమైంది. 5 వేలకు మందికిపైగా పాల్గొన్న నేపథ్యంలో ఏషియన్ బుక్, ఇండియన్ బుక్, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను నగర పాలక సంస్థ సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు 4 వేల 500 మందితో సెల్ఫీలుండగా వాటిని అధిగమించడంతో రికార్డులు వచ్చాయని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో వచ్చిన 912 బహుమతులు, జ్ఞాపికలను వేలానికి ఉంచారు. ఈ ప్రక్రియ నిన్నటి నుంచి ప్రారంభమై.. ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనుంది. దీని ద్వారా వచ్చిన సొమ్మును గంగా నది శుద్ధి కార్యక్రమం 'నమామి గంగే ప్రాజెక్టు'కు అందిస్తారు. వేలం ప్రక్రియ వివరాలను కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి నిన్న ఢిల్లీలో పాత్రికేయులకు వివరించారు. ఈ–వేలంలో పౌరులు పాల్గొని 'నమామి గంగే ప్రాజెక్టు'కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆసక్తి కలవారు pmmementos.gov.in ను సందర్శించి వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చు.

---------------------------

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ రోజు స్వామివారి దర్శనం కోసం 22 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఇక నిన్న 80 వేల 551 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న స్వామివారి హుండీ ఆదాయం 4 కోట్ల 27 లక్షల రూపాయలు వచ్చిందని తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

=====================